


# ఆఫీసరూ – ఆవుపాటా

తాళ్లూరు నాగేశ్వరరావు

ఆ వూరికి కొత్తగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా వచ్చిన సుబ్రహ్మణ్యం, ఉదయం తొమ్మిదిం బావుకల్లా అత్తగారి వూరినుంచి బస్సు దిగాడు. చేతిలో వున్న లెదర్‌బ్యాగ్‌ను కిందబెట్టి, ఓ మారు మెడ కాలర్‌ను సర్దుకొని, ఊరికేసి తేరిపారజూశాడు. రంగులు వెలిసిపోయిన డాబాలతో, వర్షాలకు గవుసువేసిన పెంకుటిళ్ళతో, రెల్లు కుంగిన పూరిళ్ళతో, ఏపుగ్గ ఎదిగిన చెట్లతో, అక్కడక్కడా దాలిగుంటల్లోంచీ, వంటగదుల్లోంచీ వస్తోన్న పొగలతో – ఆ వూరు సగటుగా, సాదాగా కనబడింది.

హైవేకు ఎదురుగ్గా ఉన్న రోడ్డు అధ్వాన్నంగా వుంది — గోతులతో, బయటపడిన కంకరరాళ్ళతో, రొచ్చు గుంటల్నుంచి పొంగే ప్రవాహంతో, రోడ్డుకు అవతలా, ఇవతలా ఉన్న ఆవుల్నిబట్టీ, కమ్మరి చక్రాలనుబట్టీ, పేర్చిన కుండల్నిబట్టీ – అది కుమ్మరి పాలెంగా గ్రహించాడు సుబ్రహ్మణ్యం. ఊళ్ళో రోడ్లన్నీ ఇంత అధోగతిలోనే వుండి వుంటాయి అనుకున్నాడు. ప్రెసిడెంటూ, పాత ఆఫీసరూ ఏం చేసినట్టు? కనీసం హైవేకు పక్కనున్న రోడ్లనైనా నదురుగా, నీట్‌గా ఉంచుకో వద్దూ ! బస్సుల్లో పోయేవాళ్ళు, 'ఇది బీదవూరు కాబోలు' అనుకోరూ ! ఊరి హోదాను రోడ్లే చెబుతాయి. తను ముందుగా ఈ వూరు రోడ్లను బాగు చేయించే కార్యక్రమాన్ని చేబట్టాలి ! అనుకున్నాడు సుబ్రహ్మణ్యం.

తనని రిసీవ్ చేసుకొనేందుకు ఎవరైనా పంచాయితీ బోర్డు బంట్రోతు వచ్చాడేమోనని బస్సుస్టాండంతా కలియజూశాడు సుబ్రహ్మణ్యం. పంచాయితీ బోర్డు ముద్రతో, కాకీ దుస్తుల్లో వున్న బంట్రోతులెవరూ ఆ ఛాయల్లో లేరు. బస్సు దిగిన ప్రయాణికులందరూ సంచులు పుచ్చుకొని చడీచప్పుడు చేయకుండా మూడు నిముషాల్లోనే ఎటు వాళ్ళు అటు వెళ్ళిపోయారు.

బస్సు కూడా కదిలిపోయింది.

చింతచెట్టు కిందున్న టీ స్టాల్ కొయ్య బెంచీమీద కూర్చుని ఎవరో ఇద్దరు కుర్రాళ్ళు టీ తాగుతున్నారు. ఆ టీస్టాల్ పక్కనే కిళ్ళీబడ్డీ ఉంది. కిళ్ళీబడ్డీమీద ఓ నడివయస్సు స్త్రీ కూర్చుని వుంది. ఎర్రగా, బొద్దుగా, కన్నుల కింపుగా, మగతనాన్ని ఛాలెంజీ చేస్తూన్నంత కవ్వింపుగా, ఆకర్షణ కేంద్రస్థానంగా ఉంది. కొన్ని క్షణాల పాటు ఆమెకేసి చూశాడు సుబ్రహ్మణ్యం రెప్పలార్పకుండా. కిళ్ళీబడ్డీ దగ్గర ఇద్దరు, ముగ్గురు చేరారు. ఓ రైతు యువకుడు పొలం వెళుతూ సోడా తాగుతున్నాడు. ఓ సిల్కులాల్చి షోకిల్లా కిళ్ళీ కట్టించుకుంటున్నాడు. 'అక్కడ కిళ్ళీబడ్డీ పెట్టుకున్నందుకు ఆమె పంచాయితీకి పన్ను చెల్లిస్తూందా ?' అన్న సందేహం కలిగింది సుబ్రహ్మణ్యానికి. తాను ఛార్జి తీసుకున్నాక ఆ విషయాన్ని ఎంక్వైయిరీ చేయాలనుకున్నాడు.

వయస్సులో వున్న కన్నెపడుచు వొయ్యారంలా తొమ్మిదిగంటల ఎండ మిడిసిపడుతోంది.

పాంటు జేబులోంచి కర్చీఫ్‌ను తీసి చిరుచెమటపట్టిన మొహాన్ని తుడుచుకున్నాడు. అతనికి ఆ వూరు కొత్త. ఊళ్లో బోర్డు ఆఫీసుకు వెళ్ళటానికి

ఎవర్ని అడుగుదామని ఆలోచిస్తూండగా, పెద్ద శబ్దం చేసుకుంటూ ఓ మోటారు సైకిలు అతని పక్కగా వెళ్ళింది. కిళ్ళీ బడ్డీ దగ్గర ఆగింది. ఆ బులెట్ మోటారు సైకిలు శబ్దంతోపాటు, దాని మీద ఠీవిగా కూర్చున్న కాంట్రాక్టరు కోటేశ్వరరావు గ్లాస్కో లాల్చీకి అంటుకున్న 'ఇంటిమేట్' సెంటువాసన గుప్‌మని గాలిలో కలిసి, సుబ్రహ్మణ్యానికి సువాసనల్ని వెదజల్లింది.

ఆ మోటారు సైకిలుమీద కూర్చున్న సరదాపురుషునికేసి తేరిపారచూశాడు సుబ్రహ్మణ్యం. వయస్సు ముప్పైకంటె ఉండదు; అంత లావూ, సన్నంకాకుండా సరిపడా ఉన్నాడు. చామనఛాయ; కోల మొహం; నొక్కుల జుత్తు; నిలువు క్రాపు; రేబాన్ గ్లాసెస్, గ్లాస్కో ధోవతి మీద గ్లాస్కో లాల్చీ, చేతికి బంగారు గొలుసుగల వాచీ; మూడు వేళ్ళకు ఉంగరాలు — ఊరు మొత్తానికి సవాల్ చేసే షావుకారు బిడ్డలాగా ఉన్నాడు. మోటారు సైకిలుమీదనుంచి దిగకుండానే, కిళ్ళీబడ్డీ బుల్లెమ్మతో ఏదో చెప్పగా, ఆమె మొహాన్ని పున్నమినాటి వెన్నెలచేసుకొని ఫిల్టర్ గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్టు పెట్టె పుచ్చుకొని, పైటజారిపోతూన్నా, బరువైన వక్షాలు బింకంగా కదులాడుతూన్నా గమనించకుండా చెంగున పెట్టె దిగి సిగిరెట్టు పెట్టె అందించింది. అతగాడు పర్సు దీసి అయిదురూపాయల నోటు ఆమెకు అందించాడు. ఆ నోటు అందుకుంటూ ఆమె వన్నెలూ, చిన్నెలూ చిద్విలాసంగా ప్రదర్శించి, మళ్ళీ కిళ్ళీ కొట్టు ఎక్కి కూర్చుంది.

కాంట్రాక్టరు కోటేశ్వరరావు మోటారు సైకిల్ని స్టార్టుచేసి, రోడ్డు ఎక్కుతూ సుబ్రహ్మణ్యంకేసి చూస్తూ, దగ్గర కొచ్చాడు. అది ఆ వూరికి కొత్త మొహమనీ, ఆ మొహంలో ఆఫీసరు లక్షణాలు కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయనీ — ఇట్టే గ్రహించాడు. మోటారు సైకిలు దిగుతూ, "నమస్కారం సార్. ఎవరి కోసం ఎదురుచూస్తున్నారు?" అన్నాడు కోటేశ్వరరావు వినయంగా.

ఆ పలకరింపుకూ, అందులోని వినయసంపత్తికీ ఆశ్చర్యపోయాడు సుబ్రహ్మణ్యం.

"ఈ వూళ్ళో పంచాయితీ బోర్డు ఆఫీసెక్కడ?" అన్నాడు సుబ్రహ్మణ్యం కొంచెం హోదాను కనబరుస్తూ.

ఆవలిస్తే పేగులు లెక్కించే వ్యాపార నైపుణ్యంగల కోటేశ్వరరావు ఇట్టే పసిగట్టాడు.

"మీ పేరు సుబ్రహ్మణ్యం..."

"అవును."

"ఈ వూరికి కొత్త ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు..."

"కరెక్ట్."

"రండి సార్. నా బండి ఎక్కండి. ఆఫీసుకు తీసుకెడతాను. నా పేరు కోటేశ్వరరావు. ఈ వూరు ప్రెసిడెంటుగారి మేనల్లుడ్ని," అన్నాడు కోటేశ్వరరావు అతని చేతిలో బ్యాగ్ అందుకుంటూ.

"ఎందుకులెండి. అడ్రసు చెప్పండి, నడిచే వెళతాను'' ఆ మాటల్లే దొర్లిన మొహమోటాన్ని అక్షరాలురాని అబ్బాయి కూడా పసిగట్టగలడు.

"అదేమిటి సార్! మిమ్మల్ని నడిపించడమా? ఊళ్లో మా ప్రిస్టేజి ఏంకాను? ఎక్కండి సార్." అన్నాడు కోటేశ్వరరావు అర్థింపుగా.

వెనక ఎక్కి కూర్చున్నాడు సుబ్రహ్మణ్యం అట్టే ఆలోచించకుండా.

మూడు నిముషాల్లో పంచాయితీ బోర్డు ఆఫీసుకు వెళ్ళారు. వెనక సీట్లో కూర్చుని ఆ గ్రామపు వీధులూ, వీధులకు ఇరుప్రక్కలా వున్న ఇళ్ళూ, వీధుల్లో ఎదురైన జనాన్ని పరిశీలనగా చూశాడు సుబ్రహ్మణ్యం. ఆ వూరి ఆర్థికపరిస్థితిని అవగాహన చేసుకొని, మనస్సులో అంచనా వేసుకున్నాడు.

కొత్తగా వచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ని హెడ్‌క్లర్కుకూ, బిల్లు కలెక్టరుకూ, శానిటరీ ఇనస్పెక్టరుకూ, వైస్ ప్రెసిడెంటుకూ కోటేశ్వరరావు పరిచయం చేశాడు. ఉదయం పదిన్నరకు ప్రెసిడెంటుగారి సమక్షంలో సుబ్రహ్మణ్యం ఛార్జి పుచ్చుకున్నాడు. ఆ సందర్భంలోనే కాంట్రాక్టరు కోటేశ్వరరావు ఆఫీసులో సిబ్బంది అందరికీ ఇడ్లీ, కాఫీ తెప్పించి ఓ చిన్న సైజు పార్టీ ఇచ్చాడు.

ఆ రోజు మధ్యాహ్నం సుబ్రహ్మణ్యం హెడ్‌క్లర్కును పిల్చి, "ఉండటానికి మంచి వసతిగల ఓ ఇల్లు చూడాలండీ! వారం రోజుల్లో ఫామిలీ వస్తుంది," అన్నాడు.

"యస్సార్! ఎన్ని గదులుండాలి?" అన్నాడు హెడ్‌క్లర్క్.

"రెండుమూడు గదులుగల ఓ చిన్న డాబా చాలు. నేనూ, మా ఆవిడా, పసిబిడ్డా, అదే సంసారం."

"అట్లాగే సార్. మన కోటేశ్వరరావుతో చెబుతాను సార్. ఆయనే చూస్తాడు. ఊళ్ళో అతగాడికి మంచి పలుకుబడి ఉంది సార్."

"ఆయనేం చేస్తాడు?"

"మీ కింకా తెలీదా సార్? కాంట్రాక్టరు. మన పంచాయతీ కాంట్రాక్టు వర్క్సు అన్నీ ఆయనే చేస్తాడు. మంచివాడు. వస్తుతహ పదెకరాల కొంగ్రడ ఉన్నవాడు. ప్రెసిడెంటుగారికి బాగా కావాల్సినవాడు. ఎప్పటికైనా ఎమ్మెల్లే అయి, మంత్రి అయ్యే యోగం గలవాడు," అన్నాడు హెడ్‌క్లర్కు వొళ్లు మైమర్చే హుషారుతో.

ఎందుకో సుబ్రహ్మణ్యం మనస్సు ముల్లు గుచ్చుకున్నట్లు చివుక్కుమంది.

మొహం రవ్వంత చిట్లించి మెదలకుండా ఊరుకున్నాడు.

* * *

వారం రోజుల తర్వాత ఓ రోజు సెలవు పెట్టి, అత్తగారి వూరినుంచి భార్యనూ, రెండు నెల్ల పసిబిడ్డనూ తీసుకొచ్చాడు సుబ్రహ్మణ్యం. నేరుగా అద్దె ఇంట్లోకి చేరారు. అది మూడు గదులుగల చిన్న డాబా. ముందు మెరాబా జాస్తిగానే ఉంది. పెరటి దొడ్లో దానిమ్మా, బాదం చెట్లూ ఉన్నాయి. పెరట్లో బావి ఉంది. ఇంటి ముందు పంపు ఉంది. నీటి వసతికి లోటు లేదు. నలువైపులనుంచీ గాలి ధారాళంగా వీస్తుంది. ఇల్లు సపరేట్‌గా ఉంది. ఇరుగుపొరుగుతో ఇబ్బందిలేదు. ఆ ఇల్లు బాగా నచ్చింది సుబ్రహ్మణ్యం భార్య సావిత్రికి. అదేమాట మొగుడితో అంటే సుబ్రహ్మణ్యం పొంగిపోయాడు.

"ఇల్లేకాదు. వూరు కూడా మంచిదిగానే కనబడుతోంది. దగ్గర్లోనే బస్తీ ఉంది. ఏం కావాలన్నా తెప్పించుకో వచ్చు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఆ రోజు భర్త ఆఫీసుకు వెళుతుంటే ఓ ముఖ్యావసరాన్ని వెల్లడించింది సావిత్రి.

"అబ్బాయికి ఆవుపాలు పట్టమని మా వూరు నంబి ఆచార్యులు మరీ మరీ చెప్పాడండి. మా అమ్మ కూడా చెప్పింది. ఊళ్లో ఎక్కడైనా ఆవు పాలు దొరుకుతాయేమో వాకబు చేయండి. వాడికి డబ్బాపాలు, గేదె పాలు సరిపడవు. పాలు వంటబట్టక పోతే జబ్బు చేస్తుంది. ఆ తర్వాత గాబరాపడాల్సివస్తుంది."

"చూస్తాను" అన్నాడు సుబ్రహ్మణ్యం తేలిగ్గా.

"చూస్తానంటే కాదు. బయటివాళ్లకు ఆఫీసరుహోదాలో చెప్పినట్టు చెబితే కాదు. సాయంత్రానికల్లా ఆ ఏర్పాటు చూడాలి. రోజూ ఉదయం ఓ అర లీటర్ ఆవుపాలైనా దొరికే ఏర్పాటు చేయండి" అంది సావిత్రి గట్టిగా.

"అలాగే" అంటూ ఆఫీసుకు వెళ్ళాడు సుబ్రహ్మణ్యం – ఇంత వూళ్లో ఆవు పాలు దొరకవా అన్న ధీమాతో.

ఆఫీసు కెళ్ళగానే హెడ్‌క్లర్క్‌తో చెప్పాడు సుబ్రహ్మణ్యం ఆవుపాలను గురించి. శానిటరీ ఇన్‌స్పెక్టరుతో చెప్పాడు. శానిటరీ ఇనస్పెక్టరు తన అసిస్టెంటుతో చెప్పాడు. ఆ అసిస్టెంటు తన కిందఉండే బలగంతో చెప్పాడు. రోజూ వీధులు బాగుచేసే ముగ్గురు వెంటనే వూరిమీద బడి ఆవుగల ఆసామి కోసం ఎంక్వయిరీ చేయసాగారు. వీధి వీధీ" ఇంటి ఇంటినీ గాలించి ఎవ్వరికీ ఆవులు లేవనీ, ఒకళ్లిద్దరు రైతులకు వున్నా అవి పాలిచ్చేవి కావనీ వాళ్లు అసిస్టెంటుతో సాయంత్రం నాలుగింటికి చెప్పగా, ఆ అసిస్టెంటు శానిటరీ ఇన్‌స్పెక్టరుతోనూ, శానిటరీ ఇన్స్‌స్పెక్టరు హెడ్‌క్లర్క్‌తోనూ, ఫైనల్‌గా హెడ్‌క్లర్క్ ఎక్జిక్యూటివ్ ఆఫీసరుతోనూ చెప్పాడు.

కుర్చీలో కూర్చున్న సుబ్రహ్మణ్యం అదిరిపడి, అధాట్టుగా కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు.

"ఏమిటోయ్ ! ఊళ్లో పాలిచ్చే ఆవు ఒక్కటి కూడా లేదా ?"

"లేదండీ ! మనవాళ్లు ఊళ్ళో ఉన్న పశువుల నన్నింటినీ తనిఖీచేసి వచ్చారు సార్ ! ఊళ్ళో ఉన్నవి రెండే ఆవులట సార్ ! ఒకటి పురోహితుడు రామ శాస్త్రి దగ్గరున్నది. అది యింకా రెండు నెలలకుగానీ ఈనదట సార్, రెండోది వెంకయ్య నాయుని దగ్గరుంది. అది ముసల్ది. ఈ యేడు కట్టలేదంట," అన్నాడు హెడ్‌క్లర్క్ మొహం వాల్చుకుని.

"మరెట్లా ? ఈ రాత్రికే మావాడికి ఆవు పాలు పట్టాలి !" అన్నాను సుబ్రహ్మణ్యం గాబరాపడుతూ.

"ఆవుపాలు బదులు......" ఏదో మాట్లాడబోయాడు హెడ్‌క్లర్క్.

"బదులో, కొసరా లేదు. నాకు ఆవు పాలు కావాలి. మా ఆవిడ తెమ్మంది. మా అబ్బాయికి ఆవుపాలు లేకపోతే రాత్రి గడవదు...మీరు ఎన్ని తిప్పలైనా పడండి. ఎక్కడైనా తిరగండి. ఆవుపాలు పట్టుకు రండి. ఈ ఊళ్ళో ఆవు పాలు దొరక్కపోతే మా ఆవిడ ఒక్క రోజు ఉండదు. మరో వూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకోమని పట్టుబడుతుంది. మా అబ్బాయి 'ఆరోగ్యంకంటె నాకు ఉద్యోగం గొప్పదేమీ కాదు" అన్నాడు సుబ్రహ్మణ్యం ఆవేశంతో వూగిపోతూ.

సరిగ్గా అదే సమయంలో ఆపద్బాంధవుడిలా కాంట్రాక్టరు కోటేశ్వరరావు వచ్చాడు గదిలోకి, "నమస్కారం సార్ !" అనుకుంటూ. గది ముందు వుండి ఆఫీసరుగారి మాటల్నీ, ఆయన ఆదుర్దాకీ, ఆగ్రహానికి హేతువుల్నీ, వొచ్చిపడ్డ సమస్యనూ విన్నాడు.

ఆఫీసరుగారి అనుమతి లేకుండానే కుర్చీలో కూర్చుని, "ఏం జరిగింది సార్ !" అన్నాడు కోటేశ్వరరావు.

"ఆవుపాలు..." నసిగాడు హెడ్‌క్లర్క్.

"ఊర్లో దొరకలేదా ?" అన్నాడు కోటేశ్వరరావు కనుబొమ్మలపైన ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.

"దొరకవంటున్నారు వీళ్లు. ఆవు పాలు దొరకని గ్రామం వుంటా మన భారతదేశంలో." అన్నాడు సుబ్రహ్మణ్యం ఆశ్చర్యాన్ని కనబరుస్తూ.

"ఆవుపాలు ఎవరికి సార్ ?"

"మా అబ్బాయి. వాడికి ఆవుపాలు తప్ప ఏ పాలూ సరిపడవు. అవి

ఇక్కాడ దొరక్కపోతే ఏం చేయాలో అయోమయంగా ఉంది."

"డోంట్ వర్రీ సార్ ! తెల్లారే పాటికల్లా ఆవుపాలు దొరికే ఏర్పాటు చేస్తాను. ఓ మంచి పాడి ఆవును తోలించే ఎరేంజ్‌మెంట్ చేస్తాను. మీ సమస్య తీరిపోతుంది. సరేనా ?" అన్నాడు కోటేశ్వర్రావు హామీ ఇస్తున్న ధీమాగా.

సుబ్రహ్మణ్యం మొహానికి పట్టిన మబ్బులు ఇట్టే విడిపోయాయి.

"నిజమా ?"

"ఇంత చిన్న విషయాల్లో అబద్దాలాడటం నా బిజినెస్ లక్షణం కాదు సార్ ! 'ఆఫ్ట్రాల్ ఆవుపాల దేముంది. సార్ ! ఈ జిల్లాలో ఏ మారుమూల పాలిచ్చే ఆవు వున్నా తెల్లారేపాటికి మీ ఇంటిముందు కట్టించే ఏర్పాటుమెంట్ చేయనూ ?"

"కోటేశ్వర్రావుగార్లు దేనికైనా సమర్థులు సార్ ! ఆయన తల్చుకుంటే ఆవుపాలకు కొదువేముంది?" అన్నాడు హెడ్ క్లర్క్, తెచ్చిపెట్టుకున్న ఉషారుతో.

"వెరీగుడ్ ! థ్యాంక్యూ మిస్టర్ కోటేశ్వర్రావ్" అన్నాడు సుబ్రహ్మణ్యం కొత్త ఉత్సాహంతో.

"సార్ !.........నా బిల్లొకటి పెండింగ్‌లో వుంది సార్ ! మీరు దయవుంచి వెంటనే సెటిల్‌చేస్తే ఆరు వేల రూపాయలొస్తాయి. కూలీలకు బట్వాడా ఇవ్వాలి" అన్నాడు కోటేశ్వర్రావు కృత్రిమమైన అర్థింపుతో.

"ఏ బిల్లు ?"

"హరిజనవాడలో మెటల్ రోడ్డు తాలూకు బిల్లు సార్"

"పెండింగ్‌లో ఎందుకుంది ?"

"దానికో హిస్టరీ వుంది సార్, మూణ్ణెల్ల క్రితం మంత్రిగారు హరిజనవాడలో గ్రంథాలయానికి ప్రారంభోత్సవం చేశారు సార్. అంతకుముందు మూడు రోజుల్లో మెటల్‌రోడ్డు వేయమని నాకు చెప్పారు సార్. వ్యవధి తక్కువ. టెండరు పిలవటానికీ, ఎస్టిమేట్ శాంక్షన్ కావటానికీ, మంచి మెటీరియల్ సప్లయ్ చేయటానికి, కొలతలు తీసుకోవడానికి టైంలేదు సార్. మరొకళ్లు ఎవ్వరూ ఈ పనిని ఇంత తక్కువ వ్యవధిలో చేయలేరు, నన్ను చేయమని పాత ఆఫీసరు పదే పదే రిక్వెస్టుచేయగా, మంత్రిగారు వచ్చే రోజుకు ఆ రోడ్డును వేశాను సార్. అంతా బాగానే వుంది."

"మరేమైంది ?"

"ఏం కాలేదండి, మంత్రిగారు విజిట్ చేసి వెళ్ళిన రాత్రి బ్రహ్మాండమైన గాలి వర్షం వచ్చిందండి రోడ్డు ఇంకా సెట్ కాక ముందే. ఆ రోజు మంత్రిగారి దర్శనార్థమై వచ్చిన జనం తొక్కిసలాటలో రోడ్డు కాస్త కదిలింది. జోరున వర్షం కురవడంతో, పల్లెలోని పల్లపు నీరంతా వరదలా వచ్చి పడటంతో కొత్త రోడ్డు కాస్తా కొట్టుకుపోయిందండీ. బిల్లు పేమెంట్‌లో పాత ఆఫీసరు పేచీ పెట్టాడండీ. పేచీ తెగకముందే బదిలీ అయిపోయాడండీ ! అదీ దాని చరిత్ర నిజంగా ఆ కాంట్రాక్టులో నాకు మిగిలింది శ్రమేగానీ, పైసా మనీ లేదండీ. ఓ వెయ్యి రూపాయలు నష్ట మొచ్చిందండీ, ప్రిస్టేజి కింద పనిచేశానండీ !"

"ఐ సీ చూస్తాను."

"చూస్తానంటే కాదండీ మీరు హెల్ప్ చేయాలి. పర్సంటేజ్ దగ్గర పాత ఆఫీసరు పేచీ పెట్టుకొని, పంగనామాలు పెట్టి పోయాడండి మీరు దయవుంచి..."

"చూస్తా నన్నానుగా, ముందు ఆవుపాల సంగతి..."

రేపు ఉదయమే తోలిస్తానుగా ఆవును. వస్తాను సార్ నా బిల్లు సంగతి జ్ఞాపకం పెట్టుకోండి" అంటూ బయటి కొచ్చాడు కాంట్రాక్టరు కోటేశ్వర్రావు.

వరండాలో నిలబడి లాల్చీ జేబులోంచి గోల్డ్‌ఫ్లేక్ పెట్టె బయటికి తీస్తూండగా హెడ్‌క్లర్క్ వచ్చాడు ముసి ముసి నవ్వులు నవ్వుకొంటూ.

"ఏం పంతులూ !"

"రేపే బిల్లు సబ్‌మిట్ చేస్తానండీ. ఏం చేస్తాడో ఈ ఆఫీసరు" అన్నాడు హెడ్‌క్లర్కు.

"చేసేదేముంది ? రేపు తెల్లారేపాటికి ఆవును తోలిస్తా నన్నానుగా. రేపు సాయంత్రానికి బిల్లుమీద పేమెంట్ ఆర్డరేస్తాడు. బిజినెస్‌లో ఇలాంటి ఆబ్లిగేషన్స్ ఆఫీసర్లకూ తప్పవు, మాకూ మంచినీళ్ల ప్రాయమే" అన్నాడు కోటేశ్వర్రావు సిగిరెట్టు వెలిగిస్తూ.

* * *

మరునాడు ఉదయం తూర్పు రేఖలు పొంతం విచ్చుకోక ముందే, బయట ఎవరో తలుపు కొట్టిన శబ్దం వినిపించి, చివుక్కున లేచాడు సుబ్రహ్మణ్యం. అప్పటికే ప్యూను తలుపు తెరిచాడు.

ఇద్దరు మనుషులు ఓ నల్ల ఆవునూ, దూడనూ లోపలకు తోలుకొచ్చారు. మెరాబాలో ఉన్న కొబ్బరిచెట్టుకు కట్టివేశారు.

"కోటేశ్వర్రావు అయ్యగారు ఈ ఆవును పంపించారండీ," అన్నాడు తుమ్మమొద్దు ఆకారంలో వున్న ఓ నడి వయస్కుడు.

ఆవు మోరెత్తి దిక్కులు చూస్తోంది. ముచ్చటగా, ముద్దుగా వున్న దూడ దాని పొదుగు కోసం పాకులాడుతోంది.

"ఎక్కడ కొన్నాడురా ?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఏమోనండీ. ఎవరో చావటికాడికి తోలుకొచ్చారండి. ఈడ దిగవిడిసి రమ్మని మమ్మల్ని పంపించినాడండి"

అన్నాడు మరో వ్యక్తి తలగుడ్డను తీసి గాలిలో దులుపుతూ.

సావిత్రి ఇంట్లోంచి వచ్చింది కళ్లు నులుముకుంటూ. నల్లగా నిగనిగ లాడుతూ, నిలువు కొమ్ములతో బలిష్ఠంగావున్న ఆవునూ, తెల్లమచ్చలతో చిరుగంతులేస్తూన్న దూడనూ చూడగానే ఆమె మనస్సు సంతోషంతో నిండిపోయింది. అబ్బాయి ఆరోగ్యానికి ఆసరా దొరికినట్టు సంబరపడింది. ఆవు చుట్టూ, దూడ చుట్టూ రెండుసార్లు ప్రదక్షిణ చేసి, సంతృప్తి నిండిన మొహంతో భర్తకేసి చూసింది.

"ఈ ఆవును ఇక్కడే కట్టేసుకుందామా? పాలు పితకడం నాకు రాదే" అంది సావిత్రి.

"నేనుండా నమ్మగోరూ! నేను పాలు పితుకుతాను. మేత తెస్తాను. దానా వేస్తాను. ఆ సింతేమీ అక్కర్లేదు. ఆవు మనకాడవుండేనే పాలు నిఖార్సుగా వుంటాయి. ఏడనన్నా పెడితే కల్తీ కలుపుతారు" అన్నాడు ప్యూను రామవులు.


వాడి మాటల్లో నిజం తోచింది సుబ్రహ్మణ్యానికీ, ఆయన భార్యకూ. అందుచేత వాళ్లు ఆవునూ, దూడనూ అక్కడే వుంచే ఏర్పాటుచేశారు.

ఆఫీసుకు వెళ్లక ముందే ఇంటి ముందు మెరాబాలో ఓ పక్కన ఆవుకీ, దూడకూ సోపరా వేయించాడు సుబ్రహ్మణ్యం. మేత కూడా తెప్పించాడు. ఆపూట ఆవుపాలే పట్టారు వాళ్ల ముద్దులకొడుక్కి.

ఆ రోజు పదిన్నరకు ఆఫీసుకు వెళ్ళాడు సుబ్రహ్మణ్యం.

పదకొండు గంటలకు కాంట్రాక్టరు కోటేశ్వర్రావు బిల్లును సమర్పించాడు హెడ్‌క్లర్కు పంతులు.

పన్నెండున్నర గంటలకు కాంట్రాక్టరు కోటేశ్వర్రావు పంచాయతీ బోర్డు ఆఫీసుకు వచ్చాడు.




ఒంటి గంటకు హరిజనవాడకు వెళ్ళాడు సుబ్రహ్మణ్యం, ఆ రోడ్డును చూడటానికి, బంట్రోతు ఫైలును పుచ్చుకు రాగా. అక్కడ రోడ్డువేసినట్టు ఆనవాళ్లు అట్టే లేవు. హరిజన వాడలోని కొంతమంది పెద్దలను విచారించాడు సుబ్రహ్మణ్యం.

మంత్రిగారు వచ్చే ముందు రోడ్డు వేయటం, ఆ రోడ్డుమీద ఊళ్లో జనం తొడతొక్కిడిగా నడవటం, ఆ రాత్రి బ్రహ్మాండమైన వర్షం పడడం, ఆ వర్షానికి నీళ్లు రోడ్డుమీద ప్రవహించడం, రోడ్డు కొట్టుకుపోవడం, మెటల్ రాళ్లు పూర్తిగా బయటపడడం, ఆ రాళ్లను చుట్టుపక్కలవాళ్లు పల్లెకెలతో తమ ఇళ్ల ముందు చేరవేసుకోవడం మొదలైన విషయాల్లో అసత్యమేమీ లేదని తెలియవచ్చింది. నలుగురూ చెప్పిన దాన్నిబట్టి సుబ్రహ్మణ్యం గ్రహించిందేమిటంటే-ఆ రోడ్డు వేయటానికి మెటీరియల్ చాలినంత సప్లయ్ చేయలేదనీ, సప్లయ్ చేసిన మెటీరియల్ నాసిరకమైందనీ, అందుచేతనే రోడ్డు కొట్టుకుపోయిందనీ, ఆ కాంట్రాక్టులో కోటేశ్వర్రావుకు తెండొంతులు డబ్బు మిగిలిందనీ.

ఆ సాయంకాలంవరకూ కంట్రాక్టర్ కోటేశ్వర్రావు పంచాయితీ ఆఫీసులోనే తిష్ఠవేశాడు. అయినా బిల్లు పాస్ కాలేదు. బిల్లు పాస్‌చేయటానికి సుబ్రహ్మణ్యం భయపడ్డాడు. ఏమీ భయపడక్కర్లేదని కోటేశ్వర్రావు హామీ ఇచ్చాడు. ఆడిట్ అబ్జక్షన్ వస్తుందని సుబ్రహ్మణ్యం నిర్మొహమోటంగా చెప్పాడు. ఆడిటర్ నోరు తాను మూయిస్తానని కోటేశ్వర్రావు అన్నాడు. అప్పటికీ సుబ్రహ్మణ్యం లొంగలేదు. తనకి ఉద్యోగం ముఖ్యమని మొహం చాటుచేసుకున్నాడు.

ఆ బిల్లు ఫైలు పెండింగ్‌లోనే ఉండిపోయింది.

* * *

పదిరోజులు గడిచాయి.

సుబ్రహ్మణ్యం యథావిధిగా ఆఫీసుకు వెళుతూనే ఉన్నాడు.

కోటేశ్వర్రావు కూడా అప్పుడప్పుడూ ఆఫీసుకు వస్తూనే ఉన్నాడు ఇతరత్రా పనుల మీద. ఆ బిల్లు విషయమై అతను ప్రస్తావించలేదు. ఒకసారి కామోసు, "రికార్డు అట్లా వుంది. నేను చేసేదేమీ లేదు," అన్నాడు సుబ్రహ్మణ్యం అతనితో.

కోటేశ్వర్రావు గంభీరంగా చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

సుబ్రహ్మణ్యం దొడ్లోని నల్ల ఆవు పాలు బాగానే యిస్తూన్నది. ఆ పాలు తాగుతూన్న పిల్లమ్మ ఆరోగ్యం చెక్కుచెదరకుండా ఉంది.

ఒకరోజు ఉదయం ఏడు గంటలకు సుబ్రహ్మణ్యం దగ్గరుండి ఆవుపాలు పితికిస్తూ ఉండగా సబ్ఇనస్పెక్టరూ, ఇద్దరు కానిస్టేబుల్సూ, మరో ఇద్దరూ అక్కడికి బిలబిలా వచ్చారు. వాళ్లను చూసి సుబ్రహ్మణ్యం,సావిత్రి నిశ్చేష్టులై నిలబడ్డారు. పాలు పితుకుతూన్న రాఘవులు చివుక్కున లేచి నిల్చున్నాడు.

"ఈ ఆవు మాదే దొరా !" అన్నాడు వచ్చిన వాళ్లల్లో పంచె పైకి ఎగగట్టి ముల్లుగర్ర చేతపట్టిన యువకుడు.

"అంటే!" అన్నాడు సుబ్రహ్మణ్యం అయోమయంగా.

"ఈ ఆవు మీకు ఎలా వచ్చిందండీ" అన్నాడు సబ్ఇనస్పెక్టరు.

ఆ ఆవును ఎవరు తోలుకొచ్చి, ఇక్కడ కట్టివేసింది వివరంగా చెప్పాడు సుబ్రహ్మణ్యం.

"మీరు చెప్పింది బాగానే ఉంది సార్. కాని ఇది దొంగ ఆవు. పాలెం మున్సబుగారి కొట్టంలోంచి ఎవరో దొంగిలించారు. ఆయన పోలీసు రిపోర్టు ఇచ్చాడు. పదిరోజుల్నుంచీ ఈ ఆవు కోసం గాలిస్తున్నాం," అన్నాడు సబ్ఇన్స్పెక్టరు.

"కాంట్రాక్టరు కోటేశ్వర్రావు..." ఏదో గొణిగాడు, సుబ్రహ్మణ్యం గుండెలో భయం అలముకోగా.

"ఆయన్ని గూడా విచారిస్తాం. అది తరువాతి విషయం. నేరం ఎట్లా జరిగిందీ, ఎవరు చేశారూ అన్నది కోర్టులో తేలే విషయం. దొంగిలించబడ్డ ఆవు మీ అధీనంలో ఉంది. మీరు పోలీసు స్టేషనుకు వచ్చి స్టేట్‌మెంట్ ఇవ్వాలి," అన్నాడు సబ్ఇనస్పెక్టరు ఆధికారికంగా.

సుబ్రహ్మణ్యం ఎదురు చెప్పలేకపోయాడు.

నల్ల ఆవూ, దూడతో పాటు అతనూ పోలీసు స్టేషన్‌కు వెళ్ళాడు.

కబురు చేయగా, మోటారు సైకిలు మీద కాంట్రాక్టరు కోటేశ్వర్రావు వచ్చాడు పోలీసుస్టేషన్‌కు. అయితే, ఆ ఆవు సంగతి తనకేమీ తెలియదని కూడ బ్రద్దలు కొట్టినట్టు,గోడకు సున్నం వేసినట్టు గట్టిగా చెప్పాడు.

సుబ్రహ్మణ్యం అప్రతిభుడైనాడు. మనుషుల్లో ఇలాంటి వాళ్ళు ఉంటారా అని. రెండు నిముషాల తర్వాత సుబ్రహ్మణ్యం నోరు విప్పబోగా, కోటేశ్వర్రావు గోల్డ్‌ఫ్లేక్ సిగిరెట్టు కాల్చుకుంటూ స్టేషను బయటికెళ్లాడు.

సుబ్రహ్మణ్యం మనుషులు–పాలెం మున్సబుగారి చావట్లోంచి నల్ల ఆవూ, దాని దూడనూ దొంగిలించుకొచ్చారనీ, ఆ దొంగతనం వెనుక సుబ్రహ్మణ్యం ప్రోద్బలంవుందనీ, పిల్లవాని పాల కోసం ఆయన ఈ సాహసానికి దిగినాడనీ పోలీసులు కేసు నమోదుచేసే తరుణంలో హెడ్‌క్లర్క్ జోక్యం చేసుకొని, కొత్త ఆఫీసరు సుబ్రహ్మణ్యానికీ, కాంట్రాక్టరు కోటేశ్వర్రావుకూ రాజీ చేసి, కోటేశ్వర్రావు పలుకుబడితో కేసు నమోదుకాకుండా చేయటం జరిగింది.

ఆ మరునాడే కాంట్రాక్టరు కోటేశ్వర్రావు పెండింగ్ బిల్లు మీద పూర్తి చెల్లింపుకు సుబ్రహ్మణ్యం 'శివ శివా' అనుకుంటూ కళ్ళు మూసుకొని సంతకం పెట్టాడు.

మళ్ళీ ఆవునూ, దూడనూ కోటేశ్వర్రావు పాలేరు సుబ్రహ్మణ్యం ఇంటికి తోలుకొచ్చాడు. వెంటే కోటేశ్వర్రావు కూడా వచ్చాడు.

"మా అబ్బాయికి ఆవు పాలు మాన్పించాం.ఆవు అక్కర్లేదు"అన్నారు సుబ్రహ్మణ్యం, వొళ్ళంతా కొరికి కారం పూసుకున్నట్టు కాగా.

"అదేమిటి సార్ ! ఈ ఆవును తమకు బహుమానంగా ఇస్తున్నాను, ఉంచుకోండి," అన్నాడు కోటేశ్వర్రావు చిరునవ్వు నవ్వుతూ.

"దొంగిలించబడ్డ ఆవు నాకు బహుమానమా ?-పాలెం మున్సబు..."

"-పాలెం మున్సబు ఎవరనుకున్నారు? స్వయాన మా మేనమామే. ఏదో వ్యవహారంకోసం టెంపరరీగా కొన్ని చిక్కుల్ని కల్పించాల్సి వచ్చింది, ఏమనుకోకండి సార్ !" అన్నాడు కాంట్రాక్టరు కోటేశ్వర్రావు గోల్డ్‌ఫ్లేక్ సిగిరెట్టు వెలిగిస్తూ.

